# వరద సమస్యకు త్వరలో మోక్షం..!

## తుదిదశకు చేరిన పద్మకాలనీ నాలా విస్తరణ పనులు



పద్మకాలనీలో కొనసాగుతున్న నాలా స్లాబు పనులు

ముషీరాబాద్, డిసెంబర్ 21 : అడిక్‌మెట్ డివిజన్ పద్మకాలనీలో నాలుగు దశాబ్దాలుగా ఎదురవుతున్న వరద నీటి సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. ఇటీవల చేపట్టిన పద్మకాలనీ నాలా విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. స్లాబు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. గత యేడాది క్రితం పద్మకాలనీ గురుదత్త స్కూల్ వద్ద నాలా విస్తరణ, వాహనాల రాకపోకలకు అనువుగా స్లాబు నిర్మించాలని ప్రతిపాదించారు. వ్యూహాత్మక నాలాల విస్తరణ పనుల్లో భాగంగా పద్మకాలనీ నాలాల విస్తరణ పనులు చేపట్టారు. గతంలో ఉన్న నాలా శిథిలావస్థకు చేరుకొని వరద నీటి ప్రవాహానికి స్లాబు కూలిపోయింది. అంతేకాకుండా నాలా ఇరుకుగా ఉండటంతో వరదలు వచ్చిన ప్రతిసారీ ముంపు సమస్య తలెత్తేది. దీంతో అధికారులు వరద నీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసి నాలా విస్తరణ స్లాబు పనులు చేపట్టారు. మరో వైపు హెరిటేజ్ బిల్డింగ్ నుంచి ఫీవర్ ఆసుపత్రి వెనకవైపు సాగర్ నాలా వరకు చేపడుతున్న నాలా విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పద్మకాలనీ గురుదత్త స్కూల్ వద్ద స్లాబు నిర్మాణం, విస్తరణ పనులు మరో నెల రోజుల్లో పూర్తి చేయాలని భావిస్తున్నా రు అధికారులు. ఇప్పటి వరకు చిన్న పాటి వర్షం కురిసినా వరద నీటి సమస్య తలెత్తేది. ప్రస్తుతం నాలా విస్తరణ పనులు తుదిదశకు చేరుకోవడంతో నలభై యేళ్ల వరద ముంపు సమస్యకు మోక్షం లభించనుంది.

### వరద నీటితో ఇక్కట్లు..

భారీ వర్షం కురిస్తేచాలు పద్మకాలనీలో ఇళ్లల్లోకి వరద నీరు చేరడం, స్థానికులు రోజుల తరబడి ఇబ్బందులు పడుతుండేవారు. వరద కారణంగా వచ్చిన బురదతో రెండు, మూడు రోజులు ఇక్కట్లు పడుతుండేవారు. ఇక రాత్రిళ్లు ఒక్కసారిగా వరద వస్తే ఇళ్లపైకి చేరుకొని ప్రాణాలు కాపాడుకోవడం, వరద తగ్గిన తరువాత తిరిగి ఇళ్లకు చేరుకోవడం జరుగుతుండేది. ఇక రోడ్లపై పేరుకు పోయిన బుర ద జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగిస్తే కానీ కాలు బయట పెట్టలేని పరిస్థితి ఉండేది.

### సమస్యకు శాశ్వత పరిష్కారం...

వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికే పద్మకాలనీలో నాలాను విస్తరించి బ్రిడ్జి నిర్మించడం జరిగింది. వరద సమస్య తావు లేకుండా వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– ముఠా గోపాల్, ఎమ్మెల్యే ముషీరాబాద్

## భాషా పండిత వ్యవస్థను రద్దుచేయాలి..


భాషా పండిత వ్యవస్థను రద్దుచేయాలని కోరుతూ మంత్రి కొండా సురేఖకు వినతి పత్రాన్ని అందజేస్తున్న భాషా పండిత ప్రతినిధులు

కాచిగూడ, డిసెంబర్ 21: భాషా పండిత వ్యవస్థను రద్దుచేసి, పాఠశాలలో అమలుచేస్తున్న ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి కార్యక్రమాలను కూడా రద్దు చేయాలని ఆర్‌యూపీపీటీ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా కోరారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ ఆధ్వర్యంలో గురువారం మంత్రి కొండా సురేఖను మార్యాద పూర్వకంగా కలిసి భాషా పండిత వ్యవస్థను రద్దుచేయాలని ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తిరుమల క్రాంతికృష్ణ, కోశాధికారి శర్మ, కార్యదర్శి డాక్టర్ ఎస్.విజయ భాస్కర్, హామీద్‌ఖాన్, ఇస్మాయిల్, రోహిత్‌కుమార్,దినకర్, ఎఫ్.ఎస్ అలీ, లక్ష్మీనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ గౌడ సత్రం నిర్మాణానికి రూ.30 లక్షల విరాళం


మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా డీడీని అందజేస్తున్న గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, ప్రభాకర్ గౌడ్

చిక్కడపల్లి,డిసెంబర్ 21 : వేములవాడ గౌడ సత్రం నిర్మాణానికి తెలంగాణ గౌడ సంఘాల సమన్వయ కమిటీ రూ.30 లక్షల విరాళాన్ని ప్రకటించింది. అందులో భాగంగా గురువారం తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, శ్రీ రాజరా జేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నం ప్రభాకర్ గౌడ్ చేతుల మీదుగా గౌడ సత్రం నిర్మాణ పర్యవేక్షకులు పుంజాల హరిచరణ్ గౌడ్‌కు గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్ గౌడ్ రూ.11లక్షల డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పితాని సత్యనారా యణ, సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ , గౌడ సంఘం సీనియర్ నాయకుడు ప్రేమ్‌దాస్ గౌడ్, గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి బాలగౌని వెంకటేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల పెంపునకు చర్యలు చేపట్టాలి

కాచిగూడ,డిసెంబర్ 21: తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పెంపునకు తక్షణమే చర్యలు చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కోరారు. గురువారం కాచిగూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ..కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టలో చేర్చిన బీసీల డిమాండ్‌లను వెంటనే అమలు చేయాలని కోరారు. కులాలవారీగా జనా భా లెక్కలు తీసి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 40 శాతం వరకు పెంచాలని, విద్య, ఉద్యోగాల రిజర్వేషన్లను 25 నుంచి 52 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సురేశ్, పండరీనాథ్ పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదానం

చిక్కడపల్లి,డిసెంబర్21: అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమంలో కొనసాగుతుంది. బాగ్‌లింగంపల్లికి చెందిన గురుస్వామి శంకర్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సంత్సరం కూడా బాగ్‌లింగంపల్లి ఎంఐజీ–25 స్వాములకు 41 రోజుల నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, జనవరి 3 వరకు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. స్వాములు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నరేశ్‌నాయుడు స్వామి, స్వాములు పాల్గొన్నారు.

## అలరించిన ఘంటసాల సినీ గీతాల విభావరి



ముషీరాబాద్, డిసెంబర్ 21: సద్గురు ఘంటసాల గాన కళా స్రవంతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు, పద్మశ్రీ ఘంటసాల 101వ జయంతిని పురస్కరించుకొని గురువారం చిక్కడపల్లి త్యాగరాయగా నసభలో నిర్వహించిన ఘంటసాల సినీ మధురగీతాల విభావరి పలువురిని విశేషంగా అలరించింది. గాయనీ, గాయకులు దాసరి శ్రీహరి, సురేఖ, శ్రీదేవి, లక్ష్మీ గాయత్రి, మాధవ్, మనోదివ్య, మౌనిక, దిరెన్, అఖిలేష్, స్వర్ణలతలు అలనాటి మధుర గీతాలు ఆలపించి శ్రోతలను రంజింప చేశారు. ఈ కార్యక్ర మంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని గాయనీ, గాయకులను సత్కరించారు.

## కబ్జారాయుళ్లపై క్రిమినల్ కేసులు పెట్టండి : కార్పొరేటర్

అంబర్‌పేట, డిసెంబర్ 21: గోల్నాక డివిజన్, కమలానగర్‌లోని మూసీ బఫర్ జోన్‌లో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్ని స్తున్నవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వానికి, రెవెన్యూ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశా రు. గురువారం శంకర్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడా రు. బఫర్ జోన్ కబ్జాలకు యత్నిస్తే ఎంతటి వారైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు. బఫర్‌జోన్‌లో గుడి కడుతున్నామని అక్కడి మూడు ఎకరాల స్థలంలో చెట్లను నరికి, మట్టిపోసి చదును చేయాలని చూస్తున్నారని ఆమె ఆరోపించారు. గతంలో కూడా ఈ స్థలాన్ని కబ్జాదారులు కబ్జా చేయడానికి యత్నిస్తే అడ్డుకున్నామ ని ఆమె గుర్తు చేశారు. రెండు రోజుల క్రితం రా త్రిపూట కబ్జాదారులు తిరిగి రెచ్చిపోయి రాత్రికి రాత్రి స్థలంలో చెట్లను నరికి వేయించారని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి బఫర్‌జోన్ లోని స్థలాన్ని రక్షించాలని, అక్కడ రెండెకరాలలో పార్కు, ఒక ఎకరం లో పేదలకోసం మినీ ఫంక్షన్‌హాల్‌ను అభివృద్ధి చేయాలని కార్పొరేటర్ కోరారు.

## పాత నేరస్తుడి అరెస్టు

### రూ.13 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం

ముషీరాబాద్, డిసెంబర్ 21: ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు నగలు, నగదు దోచుకొని తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్తుడిని ముషీరాబాద్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.13 లక్షల విలువైన నగలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన రాయపాటి వెంకట్‌రావు కొంతకాలం వ్యవసాయం చేసి, ఆ తరువాత నగరానికి వచ్చిన నిజాంపేటలో నివాసముంటున్నాడు. అతడిపై నగరంలోని పలు పోలీసు స్టేషన్లలో వివిధ రకాల కేసులు ఉన్నాయి. ఇదిలా ఉండగా, గత నెల 28న ముషీరాబాద్ పరిధిలోని బాకారానికి చెందిన లెక్చరర్ ఎం.డెబోరా, ఆమె కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఉద్యోగాలకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన వెంకట్‌రావు.. ఆ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 23.2 తులాల బంగారు నగలు, రూ.93 వేల నగదు, ఏటీఎం కార్డులు దోచుకొని పారిపోయాడు. ఇంటికి వచ్చిన డెబోరా.. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో కంగారు పడి లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకున్న డెబోరా.. బీరువాలోని 23.2 తులాల బంగారు నగలు, 93 వేల నగదు, ఏటీఎం కార్డులు పోయినట్లు ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి నిందితుడిని గురువారం అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 21.2 తులాల బంగారు నగలు, ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

## పెను ప్రమాదం తప్పింది..

కాచిగూడ,డిసెంబర్ 21: కాచిగూడ–మలక్‌పేట రైల్వేస్టేషన్‌ల మధ్య మలక్‌పేట రోడ్డు అండర్ బ్రిడ్జి కింద ఉన్న మట్టి కూలిపోవడంతో రైల్వే అధికారులు మరమ్మతులు చేపట్టడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే అధికారులు ఆ మార్గం గుండా వెళ్లే 24 ఎంఎంటీఎస్ రైళ్ళు, పలు రైళ్లను రద్దుచేయడంతో పాటు మరికొన్ని రైళ్లు ఆలస్యంగా బయలుదేరాయి. గురువారం సాయంత్రం మలక్‌పేట రోడ్డు అండర్ బ్రిడ్జి సమీపంలో పనులు జరుగుతుండగా ఒక్కసారిగా పట్టాల కింద మట్టి కూలిపోవడంతో రైల్వే అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. వెంటనే హైదరాబాద్ డివిజన్ డీఆర్ఎం లోకేశ్ వైష్ణోవ్, ఏడీఆర్ఎం రహమాన్, సీనియర్ డీఈఎన్ కె.ముత్యాలనాయుడుతో పాటు రైల్వే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

## మట్టికుప్పలను తొలగించండి

అంబర్‌పేట, డిసెంబర్ 21: బాగ్‌అంబర్‌పేట డివిజన్, దోభీగల్లీలో రోడ్డు వేసిన అనంతరం పేరుకుపోయిన మట్టికుప్పలను వెంటనే తొలగించాలని కార్పొరేటర్ పద్మవెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవితో కలిసి కార్పొరేటర్ బస్తీలో నూతనంగా వేసిన సీసీ రోడ్డును పరిశీలించారు. అక్కడ ఉన్న మట్టి కుప్పలను గమనించి.. వెంటనే వాటిని తొలగించాలని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు బాలరాజు, శ్రీహరి, శ్రీను, గోవిందు అర్జున్ పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి..

కాచిగూడ, డిసెంబర్ 21: చలికి తట్టుకోలేక ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ ఎస్సై సుభాశ్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(45)కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదురుగా బస్టాప్ ఫుట్‌పాత్‌పై చలితో గురువారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుని ఒంటిపై నలుపు,తెలుపు రంగు టీష ర్ట్, నషం రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.7 ఉన్నట్లు తెలిపారు. సంబంధీకులు ఫోన్: 8712660542లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

## మహిళలకు ఉచిత గ్రాఫిక్ డిజైన్ శిక్షణ

అంబర్‌పేట, డిసెంబర్ 21: శ్రీసత్యసాయి సేవా సంస్థలు, శివం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత గ్రాఫిక్ డిజైన్ శిక్షణ ఇస్తున్నట్లు శ్రీసత్యసాయి సేవా సంస్థల హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వరరావు తెలిపారు. శిక్షణ తరగతులు ఈ నెల 30 నుంచి ప్రారంభమవుతాయన్నారు. 30 రోజులపాటు కొనసాగే ఈ తరగతులు ప్రతి రోజు ఉదయం 8 నుంచి పది గంటల వరకు ఉంటాయని చెప్పారు. ఉదయం 11 నుంచి 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు కంప్యూటర్ ల్యాబ్‌ను ఉపయోగించుకోవచ్చన్నారు. 28 సంవత్సరాలలోపు మహిళలు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, ఆసక్తి గలవారు ఫోన్: 9010632555, 9848487440ల లో సంప్రదించాలని కోరారు.

## కాచిగూడ డివిజన్ అభివృద్ధికి కృషి

కాచిగూడ, డిసెంబర్ 21: కాచిగూడ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్ అన్నారు. గురువారం చెప్పల్‌బజార్ నింబోలిఅడ్డాలోని ఏకే భవన్ సమీపంలో వేస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొ రేటర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ..డివిజన్‌లో మురికినీరు రాకుండా తక్షణ చర్యలు తీసుకోనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్ యాదవ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు భీష్మాదేవ్ పాల్గొన్నారు.